# తమసః పరస్తాత్ *

అంతకుముందే సీతకూ నాకూ బ్రహ్మాండమైన పోట్లాట అయింది... నేను ఆమె యెడల నొనరించిన అపరాధంబుల జాబితా ఏకరవు పెట్టడానికి పావుగంట పట్టింది. లక్షవర్తుల వ్రతం ప్రాయశ్చిత్త కాండంలో నన్నా లేవు, అన్ని పాపాలు: నిదానంగా అన్నింటికీ ఒడిపట్టి, అయిపోయిందనిపించుకుని... ఇక ఎన్నటికీ, ఈ జన్మలో నామొగం చూడననిపించుకుని... పొమ్మనిపించుకుని... ఏ పాపమూ ఎరుగని అర్భకుడి లాగా, యింటికి తిరిగివస్తూ... ఆ పక్కకు మళ్ళాను...

–ఎవరో ధొరలు విస్కీలో వోలలాడుతున్నారు... ఆ వాసనకు, సీత కళ్ళలో కైపు మనసుకు గుఫ్ మన్నది... అదిగో, ఆ మూల ఎవరో ఆగామి దంపతుల సమక్షంలో జిన్ సీసా విడిపడ్డది... సీత సిగలో మల్లెల దొంతర గుమ్ మన్నది...

త్రాగని నిషా, భరించలేకపోయినాను, దోహదంగా రవంత హాలాహలం, విశేషం కల్తీలేకుండా, ఒక్క గుక్కన్నరలో హతమార్చి యింటికి వచ్చి ఉన్న మీటలన్నీ నొక్కి... ఆ వెలుతురు వంక ఉరిమిచూస్తూ... త్రివిక్రమంగా నిషా విజృంభింప చేసుకుంటున్నాను...

–ఆ తరుణంలో... సరిగా... వచ్చింది జానకి... ఉప్పెన వచ్చినట్లు... ఏటిపాయ కొట్టుకు వచ్చినట్టు లోపలికి వచ్చి పడ్డది... ఉరిమింది... కుర్చీలు గంద్రగోళంగా జరిపింది... రేడియోలో కాబూలీ సంగీతం త్రిప్పింది.

"ఆ శ్రుతిలో గదసారించి ఒక్క సీసపద్యం సెలవియ్యి" అని పలుకరించింది. నాలో నిషా.

ఆ తిట్లన్నీ కర్ణపేయంగా ఉన్నవి. సీతకు అన్ని బూతులు రావు. ఆమెలో యింత శబ్ద–శక్తి యిముడలేదు.

'ఎన్ని అన్నా' అలా బెల్లంకొట్టిన రాయిలాగా మాట్లాడవేం?

'పటిక–బెల్లమందూ, యింతలో నీ యిల్లు బంగారమైపోదు'.

'పోదూ ఎన్నన్నా సిగ్గులేకపోతే.'

'కులసతి సిగ్గరి కావలె, నేను యిల్లాలినీ కాను, ఎట్ సెటెరా... ఇతి మధురవాణీ...'

–జానకి కళ్ళల్లో కాటుకపెట్టలు గగ్గోలు పడినవి. అణగీమణగీ పడిఉండలేని పెదవి, భూకంపంగా అదిరింది.

నాకు నవ్వు వచ్చింది. కత్తులూ కారాలూ – మిరియాలూ నూరి–నూరి చివరికి కన్నీళ్ళలోకి తేలిపోయే ఆడతనం మీద నాకు ఎంత అసహ్యమో జానకికి తెలియదనా?

---

* ఈ శీర్షికతో శాస్త్రిగారు కొన్ని కథలు రాద్దామనుకున్నారు. – ప్రచురణ కర్తలు

గుండెలు తరుక్కుపోయేట్టు వచ్చింది జానకి. మొగరాయడంత అదిరిపాటుతో రోషంగా అక్కడ నుంచి పారిపోయింది.

ఆడ–లేడి రెండు మాటలూ మనసులో ద్వంద యుద్ధానికి తలపడుతున్నాయి. లేడి కళ్ళలో అనవసరపు జాలి.

గడియారం, గర–గరలాడింది ఖంగ్ న ఒక్కసారి మ్రోగింది. ఆ మ్రోతకు అర్థంలేదు అది పన్నెండున్నరా?

అలమారలోనుంచి, ఆల్బమ్‌ను బయటికి రమ్మని బ్రతిమాలాను. అందులో ఆడపిల్లలందరూ మడిగట్టుకు, ఎన్నాళ్ళనుంచో అట్టలచాటున అణగీ–మణగీ పడిఉన్నారు. ఈ అర్ధరాత్రివేళ, వాళ్ళ నందరినీ ఒక్కసారి తిరుగవేసి మతులు చెరచడం, మంచిదనా? పక్కలో పసిపిల్లలు కేవ్ మంటారేమో?

దీపాలన్నీ కొండెక్కినవి. కొండమీద వెండి గిన్నెలో పాయసం కొంచెం, మాలోగిలి మీదికి వొలికింది.

సీతతో పోట్లాడి గెలిపించి వచ్చాను. జానకి తనంతట ఓడిపోయినట్టు, పారిపోయింది.

–వైదేహి దబదబా తలుపుమీద బాదుతూంది ఆ చేతి చురుకు అంటే ఆకాశానికి కూడా హడలు. రవంత వెన్నెల మరకా చెరిగిపోయింది. ఎక్కడో ఉరుములు తలచుకుంటూ తలుపు గడగడలాడుతూంది. నా చేతులు వెళ్ళి గడియ తీసినవి.

వైదేహి నిలుచున్నంతమేరా చీకటిమీద, చూచాయగా డాగుపడుతూంది. కళ్ళు కరవొస్తున్నాయి... నన్ను అమాంతం కబళించి వేస్తుందనుకున్నాను ఆ తామసం.

పాపం నేనేదో అపరాధం చేశానుకదా అని దండించేందుకు వచ్చింది, పసిపిల్ల.

–పసిపిల్ల అవును, ఆడది ముత్తవతల్లి అయిన తరువాతనైనా, అగడం, మారామూ చిలిపితనం, మొండిపట్టు బావురుమనటం, మానలేదు. ఎల్లకాలమూ ఉయ్యాలలో పాపే... మనకు మాత్రం అంత అదృష్టం లేదు.

వైదేహి, హుంకరించుతూంది నేను శాలువ ముసుకు చాటునుంచి కేకవేశాను.

'ఏమిటా, మారాము? ఇలా వచ్చి పడుకో, చిచ్చికొడుతాను పిచ్చిపిల్లా'

–బల్లమీద పుస్తకాలు రెండు ఎగిరివచ్చి నా మీద పడ్డాయి గోడమీది గడియారం అద్దం పప్పుపప్పైంది.

'యింతీ మంచముపై నిదె కంతుడు కూర్చున్న వాడు...!'

కంతుడి చెంప చెల్ మన్నది. వళ్ళు ఝుల్ మన్నది పరాకున.

– ఉన్న దిళ్ళన్నీ దొంతరచేసి, తలక్రిందకు లాక్కుంది, వైదేహి...ఒత్తిగిలపోతే అక్కడ తలమోపేందుకు – చోటు లేదు.

(అచ్చైంది. పత్రిక పేరు తెలియలేదు)

* * *